వారిని ఉరి తీయాలి



మహిళలపై అత్యాచారాలు చేసి హత్యలకు పాల్పడేవారిని ఉరి తీయాలి. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించే డాక్టర్లు, సిబ్బందిపై దాడులకు పాల్పడటం నీచమైన చర్య. చాలా మంది మద్యం తాగి ఆసుపత్రికి వచ్చి అసభ్యకరంగా వ్యవహరిస్తుంటారు. అఘాయిత్యాలకు పాల్పడేవారికి కఠినమైన శిక్ష విధించాలి.

- పి.హైమావతి, ఏఎన్ఎం, పాయసంపల్లె, వీరపునాయునిపల్లె

రక్షణ ఉంటే మెరుగైన సేవలు అందిస్తారు



కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన మృగాలను కఠినంగా శిక్షించాలి. ప్రాణాలను కాపాడే వైద్యుల సేవలు అమూల్యమైనవి. వారికి రక్షణ కల్పిస్తే మరింత మెరుగైన సేవలు అందిస్తారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో మహిళా వైద్యులు, నర్సుల, సిబ్బందికి రక్షణ కల్పించాలి. అన్ని శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వాలి.

- డాక్టర్ అయిషా, బిదినంచెర్ల ఆరోగ్య కేంద్రం, సింహాద్రిపురం



ఇలాంటి సంఘటనలతో విధులు నిర్వహించలేరు



ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ఆసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది, కిందిస్థాయి సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించలేరు. రద్దీగా వుండే ఆసుపత్రుల్లో ప్రభుత్వం ప్రత్యేకంగా రక్షణ కల్పించాలి. కోల్‌కతా లాంటి ఘటన అమానుషం. ఎక్కడా ఇటువుంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

- బి.రమాదేవి,స్టాఫ్ నర్స్, ముద్దనూరు

రాత్రి పనిచేసే సిబ్బందికి మరింత రక్షణ కల్పించాలి



రాత్రిపూట విధులు నిర్వహించే మహిళా సిబ్బందికి ప్రభుత్వం మరింత రక్షణ కల్పించాలి. నిత్యం ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్న వైద్య సిబ్బందికి ప్రత్యేక రక్షణ అవసరం. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేందుకు మండల కేంద్రంలోని ఆసుపత్రికి వచ్చి మందులు తీసుకుని మారుమూల గ్రామాలకు వెలుతుంటారు. వారికి ప్రత్యేక భద్రత అవసరం.

- ఎస్.మహ్మద్ తాహా, మండల వైద్యాధికారి, వీరపునాయునిపల్లె

క్లుప్తంగా

ఘనంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు



మాలెపాడులో శ్రీకృష్ణభగవానుడి గ్రామోత్సవం

ఎర్రగుంట్ల : మాలెపాడులో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి జన్మదినం పురస్కరించుకుని శ్రీకృష్ణభగవాని విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. సోమవారం గ్రామంలోని ఎంపీపీఎస్ స్కూల్ దగ్గర శ్రీ కృష్ణుడిని కొలువు తీర్చి పూజలు చేశారు. రెండవ రోజైన మంగళవారం గోకులాష్టమి సందర్భంగా ఊరేగింపును నిర్వహించారు.

విద్యార్థికి జిల్లాస్థాయి బహుమతి

చక్రాయపేట : కలెక్టర్ ఆదేశాల మేరకు తెలుగు భాషా దినోత్సవం పురష్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో చక్రాయపేట జూనియర్ కళాశాల విద్యార్థిని కె.జ్యోత్స్నకు జిల్లాస్థాయిలో తృతీయ బహుమతి లభించినట్లు ప్రిన్సిపాల్ రంతుబాష తెలిపారు. అధ్యాపకులు ఆమెకు అభినందించారు.

మలేరియాపై అవగాహన

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలకు మలేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. అనంతరం ప్రభుత్వ వైద్యులు స్వాతిసాయి ఆధ్వర్యంలో రక్తపూతలు తీయు విధానం గురించి, వెక్టర్ కంట్రోల్, ఫ్రైడే-డ్రైడే గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి మూడు సార్లు ల్యాబ్‌కు అందజేయాలన్నారు. ఎవరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించి మలేరియా వచ్చిన వ్యక్తి గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేసి దోమల నివారణ కొరకు సైఫోనోత్రిన్ పిచికారీ చేయాలన్నారు. గ్రామంలోని ప్రజలందరికి రక్తపరీక్షలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరత్నం, ఎంపీహెచ్ఈఓ బాబాఫక్రుద్దీన్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులకు సర్వే

ముద్దనూరు : మండల కేంద్రంలో స్థానిక 4 రోడ్ల కూడలి నుంచి రైల్వే గేటు వరకు ప్రధాన రహదారి విస్తరణ పనులకు మంగళవారం సర్వే చేపట్టారు. సుమారు 1 కి.మీ పొడవునా రహదార విస్తరణతో పాటు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువ నిర్మాణం పనులు చేపట్టనున్నారు. సుమారు 4 నెలల క్రితమే ఈ రహదారి విస్తరణ పనులకు చెందిన టెండర్లు పూర్తయి, పనులు చేయడానికి అనుమతులు కూడా మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఒకసారి నేషనల్ హైవే అథారిటీ అధికారులు సర్వేచేశారు. ప్రస్తుతం సర్వే చేసి మార్కింగ్ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలి

సింహాద్రిపురం : ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు ఫిట్నెస్ కోసం 30 నిమిషాలు కేటాయించాలని మండల సభాభవనంలో కార్యాలయ సిబ్బందితో ఆయన ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చురుకైన, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించుకోవడానికి ఫిట్నెస్ చాలా అవసరమన్నారు. ప్రతీ రోజు ప్రతి ఒక్కరు 30 నిమిషాలు తమ ఆరోగ్యం కోసం కేటాయించాలన్నారు. మొబైల్‌యాప్‌లో ఫిట్నెస్ అసెస్మెంట్ పరీక్షను క్రమం తప్పకుండా అనుసరిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతుల పంపిణీ

చక్రాయపేట : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయానికి చెందిన విద్యార్థినులకు మంగళవారం ఐసీడీఎస్ శాఖ అధికారులు బహుమతులను అందజేసినట్లు ప్రత్యేక అధికారిణి గౌస్యారీ తెలిపారు. గత నెల్లో జరిగిన స్వతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వేంపల్లె ఐసీడీఎస్ సీడీపీవో సునీత ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారన్నారు. ఈపోటీల్లో విజేతలుగా నిలిచిన గీతిక, ప్రియాంక, ఔచితలకు సీడీపీవో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగసుభాషిణి, అంగన్వాడీ టీచర్ బేబి కాంచనలు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

ఘనంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

60 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ



పులివెందులలో కేక్ కట్‌చేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్‌లు



రజక కాలనీలో కేక్ కట్ చేస్తున్న వైఎస్ మధురెడ్డి



వేములలో కేక్ కట్ చేస్తున్న మండల ఇన్‌చార్జి, జడ్పీటీసీలు

పులివెందుల రూరల్/టౌన్ : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను పులివెందులలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ముందుగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌లు కేక్ కట్ చేశారు. భాకరాపురంలోని జగన్ క్యాంపు కార్యాలయంలో జేసీఎస్ కన్వీనర్ కిషోర్ ఆధ్వర్యంలో ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డి కేక్‌కట్ చేశారు. అనంతరం సుమారు 60 మంది అనాథ వృద్ధులు, వికలాంగుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రజక కాలనీలలో తొండూరు మండల వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి కేక్‌ను కట్ చేశారు. అనంతరం రామాలయం దేవాలయానికి రూ.10,116ల నగదును వితరణగా అందజేశారు. వైఎస్సార్ మెడికల్ కళాశాల ఆసుపత్రి వద్ద, 17వ వార్డు వాటర్ ప్లాంట్ వద్ద వైఎస్ మనోహర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. అంధుల ఆశ్రమంలో అంకాలమ్మగుడి ఆలయ చైర్మ న్ ప్రసాద్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : సింహాద్రిపురంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అవినాష్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ గెస్ట్‌హౌస్‌లో వైఎస్సార్సీపీ నాయకులు కుప్పాలపల్లె గ్రామానికి చెందిన రామశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకును వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డిలు కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. గండి రోడ్డులోని మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్‌లో మణిదీప్ ఆధ్వర్యంలో అనాథ వృద్ధులకు, స్థానిక రాజీవ్ కాలనీలోని మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో ఎంపీటీసీ రహంతుల్లాఖాన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిగాయత్రి, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : వైఎస్సార్సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక బస్టాండు వద్ద జడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, పీసీబీ మాజీ డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డిలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్సీపీ నాయకులు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఎంపీ అవినాష్‌రెడ్డి జన్మదిన సందర్భంగా 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. దీనబంధు మానసిక వికలాంగుల ఆశ్రమంలో రామన్నూతనపల్లె జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కమలాపురంలో..

కమలాపురం : హార్టికల్చర్ మాజీ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ప్రసాద్‌రెడ్డి రక్తదానం చేశారు. 39 మంది రక్తదానం చేశారు. అనాథ బాలుర ఛాత్రాలయంలో విద్యార్థులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక దర్గా-ఏ-గఫారియా నందు ఎంపీ బర్త్‌డే సందర్భంగా వైఎస్సార్ సీపీ మైనార్టీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ యూత్ పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు స్థానిక సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సీనియన్ నాయకుడు హనుమంతరెడ్డి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీతోపాటు గాయత్రి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మైలవరంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు వైఎస్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో డాడీహోంలో అనాథ పిల్లలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని కోడిగాండ్లపల్లె సమీపంలో ఏసు కరుణాలయ అనాథాశ్రమంలోని మానసిక వికలాంగులకు పార్టీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

తొండూరులో..

తొండూరు : మండలంలోని మదూరు గ్రామంలో తొండూరు మండల వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, మండల అధ్యక్షులు రవీంద్రారెడ్డిలు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్సీపీ నాయకులు



కమలాపురంలో రక్తదానం చేస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి



కమలాపురం : అన్నదానం చేస్తున్న ఇస్మాయిల్

సక్రమంగా ఇ-పంట నమోదు చేయాలి



ఇ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారి రాజేంద్రప్రసాద్

వేంపల్లె : ఇ-పంట నమోదులో అవకతవకలు లేకుండా సక్రమంగా నమోదు చేయాలని రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలకు మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న ఇ పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు.

ప్రతి రైతు ఏ పంట సాగు చేశారో వారు విధిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని అమ్మవారిపల్లె గ్రామ పొలాల్లో వేరుశనగ పంటను పరిశీలించారు. ఎక్కడైతే వేరుశనగ పంట బెట్ట పరిస్థితుల్లో ఉన్నదో అక్కడ వెంటనే రెండు శాతం యూరియాను నీటితో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఇలా 7 నుండి 10 రోజుల వరకు పిచికారీ చేస్తే బెట్టను తట్టుకోగలదన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలో ఖరీఫ్‌కు సంబంధించి సాగులోఉన్న ప్రతి పంటను నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్ బాబు తెలిపారు. మంగళవారం అలిదెన, పాయసంపల్లె గ్రామాల్లో చేపడుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు 2,237 మంది రైతులకు గాను 7,686 ఎకరాలలో సాగుచేసిన పంటలను నమోదు చేశామన్నారు. ఎవరైనా పంట సాగుచేసి నమోదు చేయించుకోని రైతులు ఉంటే వెంటనే రైతు సేవా కేంద్ర సిబ్బంది వద్దకు వెళ్లి వారిని తీసుకెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. ఒక్క ఎకరం కూడా వదలకుండా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇ-పంట నమోదులో అలసత్వం వహించద్దు

వేముల : ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఇ-పంటలో అలసత్వం వహించద్దని ఏఓ చెన్నారెడ్డి సిబ్బందికి సూచించారు. మండలంలోని నల్లచెరువుపల్లెలో మంగళవారం ఆయన ఇ-పంట నమోదును పరిశీలించి మాట్లాడారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 8,148 ఎకరాలను ఇ-పంట నమోదు చేశామన్నారు. ఈనెల చివరి నాటికి సాగు చేసిన అన్ని పంటలకు ఇ-పంట నమోదు చేసుకోవాలని రైతులకు సూచించామన్నారు. వచ్చే నెల నుంచి ఈకెవైసీ గ్రామ సభలు రైతు భరోసా కేంద్రాలలో ఇ-పంట నమోదు రైతుల జాబితా ప్రదర్శన ఉంటుందని, ఈనెల చివరినాటికి ఇ-పంట నమోదు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. ఇ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పెట్టుబడి రాయితీ, ఇన్సూరెన్స్ పథకాలు వర్తిస్తాయన్నారు. సెప్టెంబర్ నుంచి ప్రారంభమయ్యే పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా ప్రతి మంగళ, బుధవారాల్లో ప్రతి గ్రామానికి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు సందర్శించి వ్యవసాయ సిబ్బందికి, రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ నాగసుధ, రైతులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో తమిళనాడుకు చెందిన శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాల కంభం తిరుమలరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. నేటి నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 1గంట వరకు వైద్యులు అందుబాటులో ఉండి కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు.

అధ్యాపకుల పోస్ట్ భర్తీకి దరఖాస్తు

తొండూరు : మండలంలోని తొండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిందీ లెక్చరర్ పోస్టుకు అర్హతగల లెక్చరర్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మురళీధరరావు తెలిపారు. హిందీ ఎంఏ లో 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఈనెల 31వ తేదీలోపు కళాశాలలో తమ బయోడేటాలతో పాటు విద్యార్హత ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం 11 గంటలకు అభ్యర్థులకు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

31న ఆటో వేలం

కమలాపురం : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం తరలిస్తున్న కేసులో సీజ్ చేసిన ఆటోను ఈనెల 31వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొని ఆటోను సొంతం చేసుకోవాలన్నారు.

జూదరుల అరెస్ట్

పులివెందుల రూరల్ : పట్టణంలోని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు. మండలంలోని పేకాట స్థావరాలపై మంగళవారం దాడులు చేసి జూదరులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

అండగా ఉంటాం.. ఆదుకుంటాం



రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ రామాంజులరెడ్డిని సన్మానిస్తున్న స్థానిక నాయకులు

కమలాపురం : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి అవసరం ఉన్నా వారికి అండగా ఉంటాం. అలాగే ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటాం అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పి.వెంకటాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీరాం రమణ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, ఆస్తుల ధ్వంసం, అక్రమ కేసులు నమోదు చేయడం తదితర కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేస్తే సహించేదిలేదన్నారు. తమ కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అలాగే వారికి ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకుంటామని వారు స్పష్టం చేశారు. అనంతరం వారికి శ్రీరాం రమణ శాలువ కప్పి, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, రాజారెడ్డి, జావీద్, సుబ్బన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పి.వెంకటాపురం వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీరాం రమణ తండ్రి, మాజీ సర్పంచ్ శ్రీరాం ఆంజనేయులును వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి పరామర్శించారు. మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.

జేఎన్టీయూ ఆవిర్భావ వారోత్సవం

పులివెందుల రూరల్ : స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో అనంతపురం విశ్వవిద్యాలయం వార్షిక ఆవిర్భావ వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అరుణక్రాంతి విద్యార్థుల ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. జేఎన్టీయూ, అనంతపురం విశ్వవిద్యాలయం 2008 ఆగస్టు 18న ఏర్పడిందని, విశ్వవిద్యాలయ వార్షికోత్సవ వేడుకలను ఆగస్టు 21 నుంచి 28వరకు జరుపుతున్నామన్నారు. విద్యార్థులకు యూనివర్సిటీ గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. వివిధ విభాగాధిపతుల వారి పాత్యాంశాలు, ప్రస్తుత ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని సమగ్ర సంపూర్ణ జ్ఞానం కొరకు నిపుణులచే ఉపన్యాసాలను నిర్వహించామన్నారు. యువ ఇంజనీర్లే దేశ అభివృద్ధిని ప్రగతి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, జాతీయ సేవాపతకం ప్రొఫెసర్ శేషమహేశ్వరమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లల అభివృద్ధికి కృషి

జమ్మలమడుగు : ప్రత్యేకావసరాల పిల్లల అభివృద్ధికి భవితలో పనిచేసే ఉద్యోగులు పనిచేయాలని భవిత జిల్లా కో ఆర్డినేటర్ కేశవరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం మండల పరిషత్ ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రత్యేకావసరాలు గల పిల్లలు ప్రతిరోజు పాఠశాలకు వచ్చేలా చేయడంతోపాటు వారి పనులు వారు చేసుకునేవిధంగా చేయాలన్నారు. పిల్లలకు ప్రభుత్వ పరంగా రావలసిన మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ప్రతి రోజు స్కూల్‌కు పంపించాలని సూచించారు.

స్థానిక సమస్యలను పరిష్కరించాలని వినతి



కమిషనర్ రాముడుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకుడు నాగేశ్వర రావు

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని అనేక సమస్యలు నిత్యకృతమై ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు నగర పంచాయతీ అధికారులు చొరవ చూపాలని సీపీఐ కమలాపురం ఏరియా సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం అయన కమిషనర్ రాముడును కలసి స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు. అనేక వీధుల్లో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురికి నీరంతా రోడ్లపైకి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలు ఎత్తులో, రోడ్లు తగ్గులో ఉండటంతో వర్షం నీరంతా రోడ్లపై నిలుస్తోందన్నారు. దీంతో అవి దోమలకు నిలయాలు మారాయన్నారు. పందులు, దోమలు, విష పురుగులు ఎక్కువయ్యాయని, వాటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే చాలా మంది కూలీ పనులు చేసుకుని జీవనం గడిపే ప్రజలే పట్టణంలో ఎక్కువ ఉన్నారని, నగర పంచాయతీ పేరుతో వారికి ఉపాధి పనులు దూరం అయ్యాయన్నారు. అధికారులు స్పందించి గతంలో జాబ్ కార్డులు ఉన్నవారందరికి ఉపాధి పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు



పట్టుబడిన ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లు

పెండ్లిమర్రి : ప్రభుత్వ అనుమతి లేకుంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నందిమండలం గ్రామ సమీపంలోని పాపాఘ్ని నది నుంచి సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి నాలుగు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లు, ఒక జెసీబీ మిషన్ అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం గుర్తించిన ఇసుక రిచ్‌ల వద్దకు వెళ్లి తెచ్చేకోవాలన్నారు. రిచ్ నుంచి వచ్చే వాహనాలకు బిల్లులు తప్పని సరిగా ఉండాలన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ ఆలయ ప్రథమ వార్షికోత్సవం



శ్రీకృష్ణుడి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తాదులు



రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఉట్టి కొడుతున్న భక్తులు

పులివెందుల టౌన్ : భాకరాపురం సమీపంలోని శ్రీకృష్ణ ఆలయం ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి అందులో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. సాయంత్రం 5 గంటలకు మహిళలచే కోలాటం నిర్వహించారు. అనంతరం ప్రాకారోత్సవం, స్వస్తివాచనం, కలశారాధన, మహాపూర్ణాహుతి, క్షమామంత్రము, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీకృష్ణుని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.